క్లుప్తంగా

నేడు శివ పార్వతుల కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య, ఆకుల మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. శివుని జన్మ నక్షత్రం ,అరుద్ర సందర్భంగా జరిగే కళ్యాణోత్సవ కార్యక్రమానికి బ్రహ్మశ్రీ, శివశ్రీ శర్మస్వామి వ్యాఖ్యానం చేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు.

ఎల్లమ్మ సోలెం ఊరేగింపు ప్రారంభం

కలికిరి: కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ జాతర సందర్భంగా ఆదివారం సాయంత్రం ఎల్లమ్మ సోలం ఊరేగింపు ప్రారంభించారు. జాతరకు 20 రోజులు ముందు సోలెం ఆలయం నుంచి బయల్దేరి కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో ఊరేగింపు అనంతరం జాతర ముందు రోజు తిరిగి ఆలయానికి చేరుకోవడం ఆనవాయితీ. ఈ మేరకు ఆదివారం వైభవంగా సోలెం ఊరేగింపు ప్రారంభమైంది. జూలై 7 నుంచి 11వ తేదీ వరకు ఎల్లమ్మ జాతర నిర్వహించనున్నారు.

నేడు గడప గడపకు మనప్రభుత్వం

గుర్రంకొండ: మండలంలోని రామాపురం పంచాయతీలో సోమవారం గడప గడపకుమన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశులు తెలిపారు. రామాపురం పంచాయతీ బోడుమల్లువారిపల్లె గ్రామం నుంచి గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

వన్‌టౌన్ రెండో ఎస్‌ఐగా మధురామచంద్రుడు



మదనపల్లె : పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ రెండో ఎస్‌ఐగా మధురామచంద్రుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ మహబూబ్‌బాషాను కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందించారు. అనంతరం డీఎస్పీ కేశప్పను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీటీఎం ఎస్‌ఐగా పనిచేస్తున్న తనను అన్నమయ్యజిల్లా రాయచోటి ఎస్‌బీ ఎస్‌ఐగా బదిలీ చేశారని, తర్వాత అక్కడి నుంచి వన్‌టౌన్ ఎస్‌ఐగా నియమించారని తెలిపారు. వన్‌టౌన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

యంగ్ ఇండియా సేవలకు సత్కారం



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా సమితి వారు ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. చుట్టు పక్కల మండలాల్లోనే గాక కర్ణాటక రాష్ట్రంలో కూడా అత్యవసర సమయాల్లో రోగులకు రక్తదానం, అనాథ శరణాలయాలకు చేయూత ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉండే సాసనమ్మ గజ్జె పూజ మహోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదాన సౌకర్యంతో పాటు బళ్ళారి డ్రమ్స్ టీం సభ్యులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. దీంతో వారి సేవలను కొనియాడుతూ గ్రామస్థులు యంగ్ ఇండియా సేవా సమితి అధ్యక్షుడు రాజశేఖర్‌ను ఆదివారం సన్మానించారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



సంతానం కోసం అమ్మవారి ఎదుటవరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె,సారెలతో మొక్కులు చెల్లించారు.

నల్ల గంగమ్మ ఆలయంలో పూజలు

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేషపూజలు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు.

వ్యవసాయ పనులకు కూలీల కొరత

- ఈ సీజన్‌లో 3258 ఎకరాల్లో వరిసాగు
- వరి కోత యంత్రాలకు పెరిగిన డిమాండ్



కొత్తపల్లెలో వరికోతయంత్రాలతో పంట కోతలు నిర్వహిస్తున్న దృశ్యం

గుర్రంకొండ: వ్యవసాయ పనులు కొనసాగించడానికి కూలీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా వరి పంట కోయడానికి కూలీల ఖర్చును రైతులు భరించలేక పోతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా రైతులు వరికోత యంత్రాలకు ప్రాధాన్యత ఇస్తుండడంతో వాటికి భలే డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం నియోజకవర్గంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి.

3258 ఎకరాల్లో పంటసాగు :
నియోజకవర్గంలో ఈ సీజన్‌లో 3258 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం అన్ని మండలాల్లోనూ వరి పంట కోత దశకు చేరుకొంది. దీంతో వరి కోతలు, పంట నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. కూలీల కొరత కారణంగా పలు రకాల వరికోత యంత్రాలు 28 వరకు నియోజకవర్గంలో రైతులకు అందుబాటులో ఉన్నాయి.

ఎకరం పంటకు కూలీల ఖర్చు రూ.16 వేలు :
వరి పంట కోయడానికి కోతల దగ్గర నుంచి పంటల నూర్పిళ్ల వరకు కనీసం 15 నుంచి 20 మంది వరకు కూలీల అవసరముంటుంది. ఒక్కో కూలీకి కనీసం గరిష్ఠంగా రూ. 800 వరకు ప్రస్తుతం రైతులు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఒక ఎకరం వరిపంట ఇంటికి చేరాలంటే రైతుకు రూ. 16 వేల వరకు ఖర్చు వస్తుంది. అసలే పెట్టుబడులు గిట్టుబాటు వరి సేద్యం కుదేలవుతున్న ఈ సమయంలో కూలీలకొరత మరింతగా రైతులను కుంగదీస్తోంది. దీంతో వరి పంట సాగు కొనసాగించాలంటే పెట్టుబడులతో పాటు ఆధునిక సాగు పద్ధతులను అందిపుచ్చుకోవాల్సిందేనని రైతుల్లో అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

వరికోతయంత్రాలో ఖర్చు ఆదా:
వరికోత యంత్రాలతో రైతులకు కూలీల ఖర్చులు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం పంట కోతకు వచ్చే సమయానికి కూలీల కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం కూలీల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో రైతులు వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. ఈనేపథ్యంలో వరి పంట కోతకు రైతులు కూలీలకు బదులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం పంట కాలం పూర్తి కావడంతో పాటు వరికోతలకు సమయం కూడా ముగిసిపోతుండడంతో ప్రత్యామ్నాయంగా వరికోత యంత్రాలను రైతులను వినియోగిస్తున్నారు. వరికోతయంత్రానికి గంటకు రూ.3500 అద్దె చెల్లించాల్సి ఉందిఈ ఎకర పంటను వరికోత యంత్రాలకు ఒకటిన్న గంటల సమసయంలో పని ముగించేస్తాయి. అంటే ఎకరం పంటకు రూ. 5250 మాత్రమే ఖర్చు వస్తుంది.

వరి పంట వివరాలు, అందుబాటులో ఉన్న వరికోత యంత్రాలు

మండలం	పంటసాగు విస్తీర్ణం (ఎకరాలు)	అందుబాటులో ఉన్న యంత్రాలు
గుర్రంకొండ	420	05
పీలేరు	682	06
వాల్మీకిపురం	526	04
కలికిరి	623	06
కేవిపల్లె	542	04
కలకడ	465	03

వ్యవసాయ కూలీలకు డిమాండ్



ప్రస్తుతం గ్రామాల్లో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. గతంలో లాగా వ్యవసాయపనులకు కూలీలు దొరకడం లేదు. వరి పంట కోతలకైతే కూలీల రేట్లు విపరీతంగా పెంచేశారు. వారి కోరిన మేరకు డబ్బులు ఇస్తామన్నా సమయానికి రావడంలేదు. ఓవైపు వరికోతల సమయం దాటిపోతోంది. మరోవైపు కూలీలు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. – నరసింహులు, గంగిరెడ్డిపల్లె

యంత్రాలే ప్రత్యామ్నాయం



వరికోతలకు కూలీల కంటే వరికోత యంత్రాలే ఎంతో నయంగా కనిపిస్తోంది. వరి కోతలకు, వడ్లు కుప్పకొట్టేందుకు, వేర్వురుగా కాంట్రాక్ట్‌లు అడుగుతున్నారు. ఈవిధంగా చేస్తే రైతులకు తలకు మించిన భారం పడుతోంది. కూలీలకైతే రూ.20 వేలవరకు, యంత్రానికైతే రూ.6 వేల వరకు ఖర్చు వస్తోంది. యంత్రాలైతే కోత కోసి వడ్లు కూడా అప్పటికప్పుడు సంచులకు నింపుతాయి. – లక్ష్మమ్మ, కొత్తపల్లె

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సులకు ఆహ్వానం

మదనపల్లె : బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్‌యూనివర్సిటీ, లర్నర్ స్టడీ సెంటర్‌లో బీఏ, బి.కాం., బీఎస్సీ కోర్సులలో తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ మీడియంలో అడ్మిషన్లు పొందేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్.డి.వెంకటశివారెడ్డి తెలిపారు. ఆదివారం బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ లర్నర్ స్టడీ సెంటర్ వారు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24 విద్యాసంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్ రెగ్యులర్, ఓపెన్, ఐటీఐ, పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు యూనివర్సిటీ అధికారులు 31-07-2023 వరకు గడువు ఇచ్చారన్నారు. అడ్మిషన్స్‌కు సంబంధించి విద్యార్థులు పదోతరగతి, ఇంటర్ మార్క్స్ కార్డ్, ఆధార్, క్యాస్ట్ సర్టిఫికేట్, 2 ఫోటోలు, స్కూల్ టీసీ తదితర అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లు, 2 సెట్లు జిరాక్స్ కాపీలను తీసుకుని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లర్నర్ స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. పూర్తివివరాలకు 8317654896, 7382929684 లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

తంబళ్లపల్లె: మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సోమవారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఏపీఓ అంజనప్ప , ఎస్ఆర్‌పీ శివయ్య తెలిపారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు ఉపాధిహామీ పథకంలో నిర్వహించిన అన్ని రకాల పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేస్తారన్నారు.

నేడు బహుజన రాజ్యాధికార సభ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బండెల గౌతమ్‌కుమార్

మదనపల్లె : పట్టణంలోని మిషన్ కాంపౌండ్‌లో సోమవారం సాయంత్రం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో బహుజన రాజ్యాధికార సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండెల గౌతమ్‌కుమార్ తెలిపారు. ఆదివారం మిషన్ కాంపౌండ్‌లో బహిరంగ సభకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో కేవలం కొన్ని వర్గాల చేతుల్లోనే అధికారం పెట్టుకుని బహుజన వర్గాలు అయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అధికారం అందనీయకుండా కేవలం అగ్రవర్ణాలు మాత్రమే పెత్తనం చేస్తున్నాయన్నారు. వీరిని కేవలం ఓటుబ్యాంకుగా మాత్రమే పరిగణించే సంప్రదాయ మనువాద దోపిడీ రాజకీయ పార్టీలుగా కాకుండా బహుజనులను రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేసేందుకు బహుజన సమాజ్ పార్టీ పనిచేస్తోందన్నారు. బహుజన రాజ్యాధికార బహిరంగసభకు బీఎస్పీ రాజ్యసభ ఎంపీ రామ్‌జీగౌతమ్, ఏపీ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, తెలంగాణ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, ఇతర ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు రెడ్డెప్ప, బురుజులక్ష్మీనారాయణ, సహదేవ, రమణ, శ్యామ్, బాలాజీ, గంగాధర, అన్సర్‌బాషా, మహేష్, లక్ష్మీపతి, శీను, శివ, అరుణ్, అనిల్, ప్రశాంత్, రవిప్రసాద్, సాయిఆనంద్, బిల్లా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో బ్యాంకింగ్ వ్యవస్థ కుదేలు

– వీసీకే పార్టీ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్

మదనపల్లె : బీజేపీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో దేశంలోని బ్యాంకులన్నీ కలిసి సుమారుగా 12 లక్షల కోట్ల రూపాయల నష్టాలను చవిచూడటం ఆందోళనకరమైన విషయమని వీసీకే పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ అన్నారు. ఆదివారం వీసీకే పార్టీ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో... 2016లో చిన్ననోట్లు రద్దుచేసి 2000 రూపాయల పెద్దనోటును ప్రవేశపెట్టినప్పుడే భారత ఆర్థిక వ్యవస్థ, బ్యాంకింగ్ రంగం కుదేలయ్యాయన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను నిర్మూలించి ప్రైవేట్ కంపెనీల ఇ-వ్యాలెట్ డిజిటల్ బ్యాంకింగ్ రూపొందించేందుకు ఒక పథకం ప్రకారం బీజేపీ వ్యవహరించిందన్నారు. గత 8 ఆర్థిక సంవత్సరాలలో(2014-2022) బ్యాంకుల నిరర్థక ఆస్తులు 66.5 లక్షల కోట్ల రూపాయలకు చేరుకోవడం, ధనికవ్యాపారుల 14.5లక్షల కోట్ల రూపాయల రుణాలను రద్దుచేయడం బీజేపీని ధనిక వ్యాపారుల పార్టీగా చెప్పేందుకు రుజువులన్నారు. ఇటీవల ఆర్‌టీఐ కింద ఓ సామాజిక కార్యకర్త అడిగిన ప్రశ్నకు...2016 నుంచి ముద్రితమైన రూ.500 నోట్లలో 88వేల కోట్ల రూపాయలు లెక్కలోకి రాకుండా అదృశ్యమయ్యాయన్న విషయం ఆందోళన కలిగించే అంశమన్నారు. బీజేపీని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓడించి ప్రభుత్వ బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత దేశప్రజలందరిపై ఉందన్నారు. మతం, కులం, ప్రాంతం, భాష, సంస్కృతుల ముసుగులో కొనసాగిస్తున్న విద్వేష రాజకీయాలను, ఆర్థికదోపిడీని ప్రజలు గుర్తించి ఆ పార్టీకి సరైన గుణపాఠం నేర్పించాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో మామిడిలో అధిక రాబడి



ఎగుమతికి సిద్ధం చేసిన ప్రకృతి వ్యవసాయ మామిడి కాయలు

గుర్రంకొండ: ప్రకృతి వ్యవసాయం ద్వారా మామిడి సాగులో అధిక రాబడి సాధించవచ్చని జిల్లా ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ మశోదమ్మ అన్నారు. మండలంలోని నడిమికండ్రిగ గ్రామంలో శ్రీనివాసులు అనే రైతు మూడు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా ఏడు ఎకరాల్లో మామిడితోటల పెంపకం చేపట్టారు. ఈ ఏడాది సదరు రైతు తోటలోని మామిడి దిగుబడిని అధికారులే సత్యసాయి జిల్లా ధర్మవరం అనంత న్యాచురల్స్, చిత్తూరు జిల్లా బంగారు పాలెం జగదీశ్‌రెడ్డి ప్రాణహిత కంపెనీకి 5.5 మెట్రిక్ టన్నుల కాయలను ఎగుమతి చేశారు. ప్రస్తుత సాధారణ మార్కెట్ ధర 7శాతం కంటే అధికంగా 20 శాతం మేరకు అదనపు ధరలకు ఈ రకం మామిడి కాయలు విక్రయించారు, ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసే పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో పాటు అధిక మద్దతు ధర లభిస్తుందన్నారు. శ్రీనివాసులు రైతు చేపట్టి మామిడితోటల పెంపకంలో పూర్తి స్థాయిలో ఎటువంటి కెమికల్స్ లేకుండా ఘనజీవామృతం ద్రావణాలు, ఇతర రకాల కషాయాలు వినియోగించారన్నారు. ప్రస్తుతం మూడు రకాల మామిడి పండ్లను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏపీసీఎన్ఎఫ్ సీనియర్ కన్సల్టెంట్ సురేందర్‌రెడ్డి, మార్కెటింగ్ ఎంటీలు పద్మావతి , వెంకటజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



మేడికుర్తి జెడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కలికిరి: మండల పరిధిలోని మేడికుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1976-77 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అప్పటి స్మృతులను గుర్తుచేసుకుని, స్నేహితులు బాగోగులను ఆత్మీయంగా విచారించుకున్నారు. 46 సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో పూర్వ విద్యార్థుల ఆత్మీయతతో పాఠశాల ఆవరణం సందడిగా మారింది. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్రమణ్యం, విశ్రాంత హెచ్‌ఎం మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కలకడ : క్రీడలతో మానసిక ఉల్లాసం-ఆరోగ్యం సాధ్యమని, యువత విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలని జేఏసీ రాయలసీమ కన్వీనర్ పాత్తూరి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని గంగాపురం పంచాయతీ షేర్‌ఖాన్‌వంకలో ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మొత్తం 25 జట్లు పాల్గొని పోటీ పడగా ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో విజేత జట్టుగా షేర్‌ఖాన్‌వంక జట్టు, రన్నర్‌గా మహల్ జట్టు నిలిచినట్లు తెలిపారు. విజేత జట్టుకు రూ.10వేలు నగదు, మెమెంటో, కప్పు, రన్నర్ జట్టుకు రూ.6వేలు నగదు రన్నర్ కప్పును అందజేసినట్లు తెలిపారు. మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్‌గా ధనాంజనేయులుకు రూ.5వేలు నగదు అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

కలకడ : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పీలేరు నియోజకవర్గ ఆ పార్టీ కో ఆర్డినేటర్ మహమ్మద్‌షరీఫ్ అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆపార్టీ సీనియర్ నాయకులు నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా ఎంపిక చేయడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించినట్లు జాతీయ స్థాయిలో విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కుటుంబ ఆరోగ్యంపై ఇంటింటి సర్వే

బి.కొత్తకోట: గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆరోగ్యంపై జాతీయస్థాయి సర్వేలో భాగంగా ఆదివారం బి.కొత్తకోట మండలంలోని కోటావూరు గ్రామంతో పాటు గ్రామ పరిధిలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌పై నిర్వహించారు. వైద్యా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబ నియంత్రణ, వ్యాధి నిరోధక టీకాలు, మాతా శిశు సంరక్షణ, పోషణరహిత, నీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సర్వే చేశారు. కుటుంబ ఆరోగ్య సర్వే ఆరవ విడత చేస్తున్నట్లు వైద్యులు పురుషోత్తం నాయక్ తెలిపారు. సర్వేలో సిబ్బంది, పాపులేషన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం చేయాలి

మదనపల్లె సిటీ: విద్యారంగ సమస్యలపై పోరాటం చేయాలని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల సంభాగ్ సంఘటన కార్యదర్శి చిన్నశ్రీరామ్ అన్నారు. ఆదివారం మదనపల్లెలో ఏబీవీపీ కార్యాలయంలో విభాగ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరంలో ఏ విధంగా ముందుకెళ్లాలో వివరించారు. జీవో 77ను అమలు చేసి పేదలకు న్యాయం చేయాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో రాజకీయ జోక్యం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ మల్లికార్జున, జిల్లా కన్వీనర్ నాగిరెడ్డి, సాయిహితేష్, అభిలాష్, గౌతమ్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

మదనపల్లె సిటీ: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమరావతి అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో వెల్‌విషర్స్ ఆధ్వర్యంలో ఫాదర్స్‌డే పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ వేసవి కారణంగా రక్తనిల్వలు తగ్గిపోతున్నాయన్నారు. ఇలాంటి సమయంలో దాతలు ముందుకు రావాలన్నారు. వెల్‌విషర్స్ నిర్వాహకులు గిరీష్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో రక్తదానం చేయుటకు రక్తదాతలు దేశవ్యాప్తంగా రక్తదాతల వివరాలు కలిగిన ఫ్రెండ్స్ 2 సపోర్టు యాప్ నందుద తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. 30 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వెల్‌విషర్స్ సభ్యులు మంజునాథ్,చంద్రశేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై 'పోరుకేక'



పోరుకేక మహా పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె : పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి నిర్వాసితుల సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో పోలవరం 'పోరుకేక' పేరుతో భారీ పాదయాత్రను చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. పోలవరం పోరుకేక కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం పట్టణంలోని మార్కెట్‌యార్డు ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. పాదయాత్ర ఈనెల 20న భద్రాచలం సమీపంలోని ఎటపాక నుంచి మొదలై 15 రోజుల పాటు ముంపు ప్రాంతాల్లో కొనసాగి జూలై 4న విజయవాడకు చేరుకుంటుందన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌లో ముంపు ప్రాంతాల ప్రజలకు పునరావాసం కల్పించాలని, పనులను తక్షణం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పునరావాసం పనుల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పోలవరం ప్రాజెక్ట్ విషయంలో కేంద్రం బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతోందన్నారు. ఏ ప్రాజెక్ట్ పరిధిలోనైనా పునరావాసం పూర్తిచేశాకే ప్రాజెక్ట్ పనులు ముందుకెళ్లాలన్నది అంతర్జాతీయంగా ఉన్న సూత్రం. అయితే పోలవరంలో నిర్వాసితులను గాలికి వదిలేసి ప్రాజెక్టను చేపట్టారని విమర్శించారు. ప్రాజెక్ట్‌లో అసలైన నిర్వాసితుల సమస్యను పక్కదారి పట్టించేలా అధికార, ప్రతిపక్షం రాజకీయ విమర్శలు చేసుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అన్యాయానికి గురవుతున్న ముంపు గ్రామాల ప్రజల కోసం చేపట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డి.ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వెంకటేష్, సురేంద్ర, నాగరాజు, రామకృష్ణ, పవన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె ఎంఈఓ-2గా రాజగోపాల్



మదనపల్లె ఎంఈఓ -2 రాజగోపాల్



పెద్దతిప్పసముద్రం ఎంఈఓ-2 గౌస్‌పీర్

మదనపల్లె సిటీ: మదనపల్లె ఎంఈఓ-2గా రాజగోపాల్ నియమితులయ్యారు. ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో రాజగోపాల్ మదనపల్లెకు ఆప్షన్ ఇచ్చారు. ఆయన ఇది వరకు నియోజకవర్గ పరిధిలోని నిమ్మనపల్లె ఎంఈఓగా పని చేశారు.

పెద్దతిప్పసముద్రం ఎంఈఓ-2గా గౌస్‌పీర్
పెద్దతిప్పసముద్రం: మండల ఎంఈఓ-2గా మండలంలోని రంగసముద్రం హైస్కూల్ హెచ్‌ఎం గౌస్‌పీర్ నియమితులైనట్లు ఎంఈఓ నారాయణ ఆదివారం పేర్కొన్నారు. 2005-2012 మధ్య పదోన్నతులు పొందిన జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంలకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఆదివారం డీఈఓ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో గౌస్‌పీర్‌ను ఎంఈఓ-2గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రెండవ ఎంఈఓగా భీమేశ్వరరావు
బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలానికి రెండవ ఎంఈవోగా భీమేశ్వరరావు నియమితులయ్యారు. ములకలచెరువు మండలం చౌడసముద్రం హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన్ను ఎంఈవోగా నియమించారు. గతంలో ఆయన పెద్దతిప్పసముద్రం మండల ఎంఈవోగా పనిచేశారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన

150 మందికి స్క్రీనింగ్ టెస్ట్



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పీలేరు రూరల్: పీలేరులో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ కంటి వైద్యులు, ఎస్‌వి అరవిందోద వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 150 మందికి స్క్రీనింగ్ చేశామని, అందులో 35 మంది ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు కె.సదాశివారెడ్డి, కార్యదర్శి పి.మహేష్‌గుప్తా తెలిపారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచిత ఆపరేషన్, భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, సత్యంరెడ్డి, మహేష్, సురేంద్రనాథరెడ్డి, సురేంద్రరెడ్డి,సుధీర్, వెంకటేష్, చంగయ్య, ఈశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.